JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 20-08-2026
Medchal - Malkajgiri । Thursday 20-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 80
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 80 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



# రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీనా..
# కాంగ్రెస్ పై తిరుగుబాటా



*తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు మరోసారి పెద్ద దుమారాన్నే రేపాయి. బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైంది, రాజకీయాలను మార్చే శక్తి నాకుంది అంటూ ఆయన చేసిన కామెంట్లు, కొత్త పార్టీ పెడతారా లేక స్వపక్షంపైనే తిరుగుబాటా అనే ఉత్కంఠను రేకెత్తించాయి.*

**జయభేరి, నల్గొండ, ఆగస్టు 19 :**

కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కీలక పదవులు కట్టబెడుతున్నారని రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా సీమాంధ్ర కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో ప్రభుత్వం నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించడం నేరుగా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రశ్నించడమే. కేబినెట్ విస్తరణ ఆలస్యం కావడం, తన కీలక అనుచరులకు ప్రాధాన్యత దక్కకపోవడం పట్ల ఆయనలో గూడుకట్టుకున్న తీవ్ర అసంతృప్తికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి.రాజగోపాల్ రెడ్డి సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని గమనిస్తే, ఆయన ప్రెజర్ పాలిటిక్స్ చేయడంలో దిట్ట. గతంలో మునుగోడు ఉపఎన్నిక సమయంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడం, ఆ తర్వాత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మళ్లీ కాంగ్రెస్ గూటికి రావడం ఆయన రాజకీయ వ్యూహాల్లో భాగమే. ప్రభుత్వం ఏర్పాటై ఇంతకాలమవుతున్నా తనను మంత్రివర్గంలోకి తీసుకోకపోవడంతో, అధిష్ఠానంపై ఒత్తిడి పెంచి రాబోయే కేబినెట్ విస్తరణలో బెర్త్ ఖరారు చేసుకోవడానికే ఇటువంటి తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారనే ప్రచారం బలంగా ఉంది.తమిళనాడు తరహా రాజకీయ మార్పు తెస్తా, కొత్త రాజకీయ శక్తులను ప్రోత్సహిస్తా అని ఆయన అనడం కొత్త పార్టీ వైపు సంకేతాలు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కొత్త పార్టీ పెట్టడం అంత సులభం కాదు. బయటకు

...మిగతాది 2 లో



# బెంగాల్లో భారీ విజయంతో సత్తా చాటిన మమత..!

- 15–3 తేడాతో సువేందు చిత్తు..!

**జయభేరి, పశ్చిమ బెంగాల్ :**

పశ్చిమ బెంగాల్లో ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుస ఎదురుదెబ్బలు తింటున్న మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఇవాళ ఘన విజయం వరించింది. రాష్ట్రంలో జరిగిన ఓ కీలక ఎన్నికల్లో మమత పార్టీ టీఎంసీ సత్తా చాటుకుంది. అదీ భారీ తేడాతో అధికార బీజేపీని చిత్తు చేసి మరీ ఈ విజయం సాధించింది. దీంతో రాష్ట్రంలో ఇంకా మమత పార్టీ టీఎంసీ బలంగానే ఉందని నిరూపితమైంది. పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్ కు తాజాగా నిర్వహించిన ఎన్నికల్లో మమతా బెనర్జీ పార్టీ టీఎంసీ సత్తా చాటుకుంది. పార్టీ నిలబెట్టిన 15 మంది అభ్యర్థులు ఇందులో ఘన విజయం సాధించారు. మొత్తం 23 సీట్లకు జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మమత పార్టీ ఏకంగా 15 సీట్లు గెల్చుకుంది. ఇప్పటికే ఆయా సీట్లలో టీఎంసీ లాయర్లే ఉన్నారు. అయితే మరోసారి ఈ స్థానాల్ని మమత ప్రస్తుత పరిస్థితుల్లో నిలబెట్టుకోవడం సంచలనం రేపుతోంది. అంతే కాదు బార్ కౌన్సిల్ పైనా మమత పట్టును

...మిగతాది 2 లో



# సీఎం రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా?

- రేవూరికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎలా ఇస్తారు
- కాంగ్రెస్ పార్టీ నాకు టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా
- రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

**జయభేరి, వరంగల్, ఆగస్టు 19 :**

తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు. పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు.తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి

...మిగతాది 2 లో



# ప్రిన్సిపాల్ హత్య కేసులో వీడిన మిస్టరీ..

- స్కూల్ విద్యార్థులే నిందితులు


**జయభేరి, నల్గొండ, ఆగస్టు 19 :**

నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ దారుణ ఘటనకు సంబంధించి, ఆమె పనిచేస్తున్న పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. టీసీ ఇచ్చిందన్న కక్ష, డబ్బు అవసరం రెండూ ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.కొండమల్లేపల్లిలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ అయిన రూపారెడ్డి (42) గత వారం జేబీ కాలనీలోని తన నివాసంలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆగస్టు 1112 తేదీల మధ్య జరిగిన ఈ ఘటనలో ఆమె శరీరంపై దుండగులు పదునైన ఆయుధంతో దాదాపు 27 సార్లు పొడిచినట్లు గుర్తించారు. భర్త పని నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ఈ హత్య జరిగింది. ఆమె ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో, అనుమానంతో బంధువులు, సహోద్యోగులు చూడగా విషయం బయటపడింది. ఘటనా స్థలంలో తొలుత

...మిగతాది 2 లో

# సామాజిక న్యాయానికి పెద్దపీట

- వడ్డెర సామాజిక వర్గానికి తొలిసారి అవకాశం
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమాదేవి
- శాసనసభలో ప్రకటించిన సీఎం చంద్రబాబు



**జయభేరి, అమరావతి :**

పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే సాధారణ కార్యకర్తలకు ఎల్లప్పుడూ సముచిత గుర్తింపు లభిస్తుందని తెలుగుదేశం పార్టీ మరోసారి నిరూపించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, అనంతపురం లోక్‌సభ నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు దళవాయి రమాదేవిల పేర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభలో స్వయంగా ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికను ఒక ముఖ్యమంత్రి అసెంబ్లీ వేదికగా వెల్లడించడం ఇదే తొలిసారి. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు వీరిద్దరి పేర్లను గవర్నర్ ఆమోదానికి పంపినట్లు ప్రభుత్వం తెలిపింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వర్ల రామయ్యను, బీసీలలోని అత్యంత వెనుకబడిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవిని ఎంపిక చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం సామాజిక

...మిగతాది 2 లో



# పామాయిల్, గంజి, పిండితో కల్తీ నెయ్యి తయారీ

- హోటళ్లు, స్వీట్ షాపులకు సరఫరా..!
- ముఠాను పట్టుకున్న పోలీసులు

**జయభేరి, హైదరాబాద్ :**

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లు కల్తీగాళ్లు రెచ్చిపోతున్నారు. చిన్న పిల్లలు తాగే పాలు, తినే చాక్లెట్ల నుంచి వంటింటి సరుకుల వరకు ప్రతిదీ కల్తీ చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కల్తీలపై ఉక్కుపాదం మోపుతున్నా.. వారి ఆగడాలు మాత్రం ఆగటం లేదు. తాజాగా.. హైదరాబాద్ శివార్లలో భారీ నకిలీ నెయ్యి తయారీ, సరఫరా ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పామాయిల్, వనస్పతి, మిల్క్ పౌడర్, గంజి, పిండి, రవ్వతో పాటు హానికరమైన సింథటిక్ రంగులు, ఫ్లేవర్లను ఉపయోగించి నకిలీ నెయ్యిని తయారు చేస్తున్న కేంద్రాలపై హెచ్‌ఫాస్ట్ బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహించాయి. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి సహా నగర శివారు ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీల్లో భారీగా కల్తీ నెయ్యి, ముడిసరుకును పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని 39 నెయ్యి తయారీ కేంద్రాలు, 91 రిటైల్ ఔట్‌లెట్లపై దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 25.5 టన్నుల నకిలీ నెయ్యి, 10 టన్నుల ముడిసరుకును అధికారులు

...మిగతాది 2 లో

# ఉరికి బదులు ఇంజెక్షన్

2 లో

జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## కాంగ్రెస్ పై తిరుగుబాటా

వస్తే ఎమ్మెల్యే సభ్యత్వం రద్దవుతుంది. రాజగోపాల్ రెడ్డికి నల్గొండ జిల్లాల్లో పట్టు ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా సొంతంగా ఒక పార్టీని నడిపించే వ్యూహాత్మక నిర్మాణం, పార్టీ క్యాడర్ బలం తక్కువ. అందువల్ల కొత్త పార్టీ అనేది ఒక హెచ్చరిక మాత్రమేనని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. సొంత పార్టీ నుంచే కాక, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర హెచ్చరికలు చేయడం తో రాజగోపాల్ రెడ్డి వెంటనే డ్యామేజ్ కంట్రోల్ చర్యలకు దిగారు. నేను కాంగ్రెస్ పార్టీని లేదా రాహుల్ గాంధీని విమర్శించలేదు, రాహుల్ నాయకత్వంలోనే పనిచేస్తా అని వెనక్కి తగ్గారు. పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకునే ప్రమాదం ఉందని గ్రహించి, లేదా అధిష్ఠానం నుంచి స్పష్టమైన సంకేతాలు రావడంతోనే ఆయన తన వ్యాఖ్యలకు సవరణ ఇచ్చుకున్నారు. రాజగోపాల్ రెడ్డి తీరు కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత అసమ్మతి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది. రేవంత్ రెడ్డి వైఖరి పట్ల సీనియర్ కాంగ్రెస్ నాయకులలో ఉన్న అసంతృప్తికి రాజగోపాల్ రెడ్డి ఒక స్పానర్ లాగా మారారు. ఈ వ్యాఖ్యలను అధిష్ఠానం తీవ్రంగా పరిగణిస్తే ఆయనపై క్రమశిక్షణా చర్యలు తప్పవు. ఒకవేళ ఆయన డిమాండ్లకు లొంగి మంత్రి పదవి ఇస్తే, పార్టీలో అసమ్మతి గళం విప్పే మిగతా నాయకులకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. రాజగోపాల్ రెడ్డి ప్రస్తుతం కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో లేరు. ఆయన వ్యూహమల్లా తన వర్గానికి సరైన ప్రాధాన్యత దక్కించుకోవడం, కేబినెట్ లో మంత్రి పదవిని సాధించడం మాత్రమే. అయితే, ప్రభుత్వంపై ప్రతిపక్షాల కన్నా దారుణంగా అవినీతి, బయటివారి పెత్తనం అంటూ బహిరంగంగా ఆరోపణలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగి ఈ వివాదానికి స్వస్తి పలకకపోతే, ఇది తెలంగాణ కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున అంతర్గత కుమ్ములాటలకు దారితీసే అవకాశం ఉంది.

## సీఎం రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా?

వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు. యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉందంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. మెయిల్, భయపెట్టాలని చూస్తున్నారంటూ కొన్ని నెలల కిందటే సీఎం రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కూతురు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఈ క్రమంలో ఇటీవల పరకాల ప్రాంత పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డే వచ్చే ఎన్నికల అభ్యర్థి అని ప్రకటించడం కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో తీవ్ర చిచ్చు రేపింది. ఈ నిర్ణయంతో మంత్రి కొండా సురేఖ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. పరకాల సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత, సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని తప్పుపడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు కౌంటర్ ఇస్తే కనుక ప్రెస్ క్లబ్‌లో కూర్చుని రేవంత్ రెడ్డి భాగోతాలు అన్నీ బయట పెడతా అని సంచలనానికి తెరలేపారు. తమ కుటుంబాన్ని కాదని రేవూరిని అభ్యర్థిగా ప్రకటించడానికి రేవంత్ రెడ్డి ఎవరని సుస్మిత నేరుగా నిలదీశారు. అసలు రేవంత్ రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా ఎదగడంలో కొండా దంపతుల పాత్ర కీలకమన్నారు. ఆ సమయంలోనే పీసీసీ అధ్యక్షుడిగా తమ ఇంటికి వచ్చి కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ఆయన మాట ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీని ఇప్పుడు విస్మరిస్తూ మాట తప్పడం ఏంటని మండిపడ్డారు. స్థానికంగా రేవూరి ప్రకాష్ రెడ్డికి ఎంత పట్టుందో ఎవరికీ తెలియదని ఎద్దేవా చేసిన ఆమె, వచ్చే ఎన్నికల నాటికి రేవంత్ సీఎం పదవిలో ఉంటారో లేదో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలనపై కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి ఉందని, ముఖ్యంగా బీసీ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ టికెట్ ప్రకటనతో సంబంధం లేకుండా రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచే తాను బరిలోకి దిగుతానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పరకాలలో పోటీ చేసి కచ్చితంగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రయాణాన్ని అడ్డుకునే శక్తి ఎవరికీ లేదని, పరకాలలోనే ఇల్లు కట్టుకుని నిరంతరం ప్రజల మధ్య ఉంటానని సుస్మిత స్పష్టం చేశారు. గతంలో కొండా మురళి తమ కుమార్తె సుష్మిత పరకాల నుండి పోటీ చేస్తుందని ప్రకటించగా, ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పరకాల అభ్యర్థిగా రేవూరి ప్రకాష్ రెడ్డి పేరును ఖరారు చేశారు. ఈ పరిణామాల మధ్య సుష్మిత చేసిన పోస్ట్ కాంగ్రెస్ వర్గాల్లో కలకలం రేపింది. అధిష్ఠానం టికెట్ నిరాకరించినప్పటికీ, తాను కాంగ్రెస్ రెబెల్‌గా బరిలోకి దిగడం ఖాయమని స్పష్టం చేయడంతో పరకాల రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

## పామాయిల్, గంజి, పిండితో కల్తీ నెయ్యి తయారీ

స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మీడియాకు వెల్లడించారు. గుజరాత్, తమిళనాడుకు చెందిన కొందరు వ్యాపారులు హైదరాబాద్‌లో మకాం ఏర్పాటు చేసుకొని కల్తీ నెయ్యి, పామాయిల్, ఫుడ్ కలర్స్ వంటి ఉత్పత్తులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బేగంబజార్, మలక్‌పేట గంజ్, సికింద్రాబాద్ తదితర మార్కెట్లతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఆయా కల్తీ సరుకును సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వ్యాపార నెట్‌వర్క్‌లోని కొందరు కలిసి నకిలీ నెయ్యి తయారీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నకిలీ నెయ్యి తయారీ కోసం ఇతర రాష్ట్రాల నుంచి నాసిరకం పాల మీగడను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో పామాయిల్, వనస్పతి, మిల్క్ పౌడర్ కలిపి నెయ్యి మాదిరి పదార్థాన్ని తయారు చేస్తున్నారన్నారు. నెయ్యికి చిక్కదనం తీసుకురావడానికి గంజి, పిండి, రవ్వ వంటి పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సహజమైన రంగు, వాసన వచ్చేలా చేసేందుకు వివిధ రసాయనాలు, ఫ్లేవర్లను కలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇలా తయారు చేసిన ఉత్పత్తులను ప్యాక్ చేసి మార్కెట్‌లోకి పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు, ఆయుర్వేద దుకాణాలకు కూడా వీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పూజల కోసం ఉపయోగించే నెయ్యి పేరుతో ప్రత్యేక బాటిళ్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు హెచ్ ఫాస్ట్ అధికారులు వెల్లడించారు.

## జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్నిసందర్శించిన కలెక్టర్

✍ **జయభేరి, మేడ్చల్:**

మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ముఖ్యంగా 22Aకి సంబంధించిన రిజిస్ట్రేషన్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 22Aకి సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్లు, వాటి పరిష్కారానికి ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలు ఎందుకు పెండింగ్లో ఉన్నాయి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏంటి అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే పెండింగ్లో ఉన్న ఇతర రిజిస్ట్రేషన్ల వివరాలను కూడా అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.




భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై మరోసారి కీలక చర్చ తెరపైకి వచ్చింది. ఉరిశిక్షకు బదులుగా తక్కువ బాధాకరమైన, మరింత మానవీయమైన పద్ధతిని అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం, నిపుణుల పరిశీలన, న్యాయస్థానం ముందున్న రాజ్యాంగపరమైన ప్రశ్నలపై ఆధారపడనుంది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారిస్తోంది. న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న ఉరిశిక్ష విధానాన్ని సవాల్ చేశారు. ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం క్రూరమైన, అమానవీయమైన పద్ధతిగా మారే అవకాశం ఉందని ఆయన వాదించారు. మరణశిక్ష విధించిన వ్యక్తికి కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించే గౌరవంతో జీవించే హక్కు, దానికి అనుబంధంగా గౌరవప్రదమైన ప్రక్రియకు సంబంధించిన హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పిటిషనర్ ప్రధానంగా ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ వంటి పద్ధతులను పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా కాల్చివేత, విద్యుదాఘాతం, గ్యాస్ ఛాంబర్ వంటి ఇతర పద్ధతులను కూడా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. అయితే ఏ పద్ధతి నిజంగా తక్కువ బాధాకరమైనది, మానవీయమైనది అనే విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదించారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ పద్ధతుల అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టలేదు. గత విచారణల్లో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, మరణశిక్ష అమలు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. వైద్య, న్యాయ రంగాలకు చెందిన నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. 2026 జనవరి 22న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు వెంటనే తుది తీర్పు ఇవ్వకుండా ఆదేశాలను రిజర్వ్ చేసింది. పిటిషనర్, కేంద్ర ప్రభుత్వం తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు మూడు వారాల సమయం ఇచ్చింది. ఇదిలా ఉండగా, ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థలో మరణశిక్ష అమలు విధానం ఉరిశిక్షగానే కొనసాగుతోంది. పాత CrPCలోని సెక్షన్ 354(5)కు సమానమైన నిబంధన ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 393(5)లో ఉంది. మరణశిక్ష విధించిన వ్యక్తిని ఉరి ద్వారా మరణించే వరకు శిక్ష అమలు చేయాలని ఈ నిబంధన పేర్కొంటుంది. ఉరిశిక్ష రాజ్యాంగబద్ధతపై గతంలోనూ సుప్రీంకోర్టు పరిశీలన జరిపింది.

1983లో 'దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం రాజ్యాంగబద్ధమేనని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పుడు పిటిషనర్ మాత్రం మారిన శాస్త్రీయ ప్రమాణాలు, మానవ హక్కుల దృక్పథం, గౌరవంతో కూడిన జీవితం అనే రాజ్యాంగ భావనల నేపథ్యంలో ఈ అంశాన్ని మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ పద్ధతిని అమలు చేయడం అంత సులభమైన నిర్ణయం కాదు. ఏ విధానం తక్కువ బాధాకరమైనది? దాన్ని శాస్త్రీయంగా ఎలా నిర్ధారించాలి? వైద్య నిపుణుల పాత్ర ఎంతవరకు ఉండాలి? మరణశిక్ష విధించిన వ్యక్తికి అమలు పద్ధతిని ఎంచుకునే అవకాశం ఇవ్వాలా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం అవసరం. అందుకే ఈ కేసు కేవలం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయం గురించిన వివాదంగా కాకుండా, మరణశిక్షను ఒక రాష్ట్రం ఎలా అమలు చేయాలి? శిక్ష అమలులోనూ మానవ గౌరవానికి స్థానం ఉందా? అనే కీలక రాజ్యాంగ ప్రశ్నగా మారింది. ప్రస్తుతం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయ పద్ధతిని సుప్రీం కోర్టు అధికారికంగా ఆమోదించిందని చెప్పడం సరికాదు. కేంద్రం పరిశీలన, నిపుణుల అభిప్రాయాలు, పిటిషనర్ వాదనలు, రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ వ్యవహారంలో తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఉరి తీయడానికి బదులుగా ప్రాణాలు తీసేందుకు తక్కువ నొప్పిని కలిగించే ప్రత్యామ్నాయ పద్ధతులను అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దేశంలో ఉరిశిక్ష అమలు విధానం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఉరితీయడం అనేది చాలా బాధాకరమైన, అమానవీయమైన పద్ధతి అని పిటిషనర్, న్యాయవాది రిషి మల్హోత్రా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉరిశిక్ష అమలు చేసిన తర్వాత మరణించినట్లు ప్రకటించే మొత్తం ప్రక్రియకు 40 నిమిషాలకు పైగా పడుతుందని, అదే ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం లేదా కాల్చి చంపడం లాంటి పద్ధతుల ద్వారా ఐదు నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తవుతుందని ఆయన వివరించారు భవిష్యత్తులో శాస్త్రీయ, వైద్యపరమైన బలమైన ఆధారాలు లభిస్తే ఈ అంశాన్ని మరోసారి పరిశీలించే అవకాశం ఉందని తెలిపింది. ఉరిశిక్ష అమలులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కావాలనుకుంటే ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి స్పందిస్తూ, ప్రత్యామ్నాయ పద్ధతులను పరిశీలించడానికి ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలిపారు. కాగా 2025 అక్టోబర్ 15న జరిగిన విచారణలో పాత పద్ధతిని మార్చడానికి కేంద్రం సుముఖంగా లేకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దోషులకు ఉరి లేదా ఇంజెక్షన్ విధానాల్లో ఒకదాన్ని ఎంచుకునే ఆప్షన్ ఇవ్వాలన్న ప్రతిపాదన ఆచరణాత్మకంగా సాధ్యం కాదని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొంది. దీనిపై స్పందించిన కోర్టు, కాలంతో పాటు విషయాలు మారుతున్నాయని, పాత పద్ధతిని మార్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడమే అసలు సమస్య అని వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించి జనవరి 22నే విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తాజాగా తన తీర్పును వెలువరించింది.

# తెలుగు రాష్ట్రాల్లో కోటి ఓట్లు మిస్సింగ్



✍ **జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 19 :**

కేంద్ర ఎన్నికల సంఘం తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో చేపట్టిన సమగ్ర ప్రక్షాళన ప్రక్రియ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రెండు రాష్ట్రాల్లో కలిపి సాంకేతికంగా కోటి ఇరవై లక్షలకు పైగా ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతున్నాయి. జాబితా నుంచి తొలగింపునకు గురవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే అయినప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయకపోవడం, సైలెంట్‌గా ఉండటం వెనుక ఏం జరుగుతోంది? వాస్తవానికి ఈ గల్లంతు ప్రక్రియ అంతా అర్హులైన ఓటర్లను తొలగించడం కాదని, ఓటర్ల జాబితాను క్లీన్ క్రమంలో జరుగుతున్న సాంకేతిక ప్రక్రియ అని పార్టీలకు స్పష్టమైన అవగాహన ఉంది. ఉమ్మడి రాష్ట్ర విడిపోయాక , హైదరాబాద్ కేంద్రంగా స్థ స్థిరపడిన లక్షలాది మందికి ఏపీ, తెలంగాణ రెండింటిలోనూ ఓట్లు ఉన్నాయి. దీనికి తోడు మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, ఆధార్‌తో ఎపిక్ సీడింగ్ జరగడం వల్ల ఈ డూప్లికేట్ , ఇన్‌యాక్టివ్ ఓట్లను ఈసీ వ్యవస్థ పసిగట్టి తొలగిస్తోంది. ఇది ఓటు హక్కును కాలరాయడం కాదని తెలిసే ప్రధాన పార్టీలు దీనిపై వీధిపోరాటాలకు దిగడం లేదు. అయితే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని ఈసీ వద్ద తరచూ ఫిర్యాదులు చేస్తోంది. దీని వెనుక కాంగ్రెస్ పార్టీకి బలమైన రాజకీయ సమీకరణాలు ఉన్నాయి. గడిచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, పట్టణ ప్రాంతాల్లో ఉన్న బోగస్, డబుల్ ఓట్లు ఫలితాలను ప్రభావితం చేశాయని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఇతర పట్టణాల్లోనూ క్రమబద్ధీకరణ జరిగితే క్లీన్ ఓటర్ లిస్ట్ వల్ల తమకే పొలిటికల్ అడ్వాంటేజ్ ఉంటుందని కాంగ్రెస్ లెక్కిస్తోంది. అందుకే ప్రతి బూత్ స్థాయిలో తమ బూత్ లెవల్ ఏజెంట్లను అలర్ట్ చేస్తూ, తొలగింపులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీజనసేన కూటమి సైలెంట్‌గా ఉండటానికి కారణం.. క్షేత్రస్థాయి రియాలిటీయే. ఆయా పార్టీల అంతర్గత సర్వేల ప్రకారం, తొలగింపునకు గురవుతున్న ఓట్లలో అత్యధికం నివాసాలు మారిన వారివి, లేదా డబుల్ ఓటింగ్‌కు అవకాశం ఉన్నవే.

ఒకవేళ పొరపాటున నిజమైన ఓటరు పేరు తొలిగినా, వారిని మళ్లీ ఫారమ్ 6 ద్వారా దరఖాస్తు చేయించి ఓటరుగా నమోదు చేయించవచ్చనే సాంకేతిక వెసులుబాటు ఈసీ కల్పిస్తోంది. రచ్చ చేయడం కంటే క్షేత్రస్థాయిలో బిఎల్ఓ ల వద్ద తమ ఏజెంట్ల ద్వారా ఓట్ల పునరుద్ధరణ చేయించుకోవడమే ఉత్తమ మార్గమని పార్టీల భావన. వాస్తవానికి ఎన్నికల సంఘం పారదర్శకంగా ఫారమ్ 7 దరఖాస్తులు, క్లెయిమ్స్ , అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను నిర్వహిస్తుండటంతో చట్టపరంగా దీన్ని ప్రశ్నించే అవకాశం తక్కువగా ఉంది. కోటి ఇరవై లక్షల ఓట్ల ప్రక్షాళన అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే క్రమంలో జరుగుతున్న ఒక ప్రక్షాళన. నిరసనలు, ఆందోళనల కంటే నిశ్శబ్దంగా బూత్ స్థాయిలో తమ మద్దతుదారుల ఓట్లు జాబితాలో ఉండేలా చూసుకోవడమే రాజకీంగా ప్రయోజనకరమని భావించి పార్టీలు వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నాయి. తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అధికారికంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 2.64 కోట్లకు పైగా మంది ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించగా, వీరి పేర్లను ముసాయిదా జాబితాలో చేర్చారు. క్షేత్రస్థాయిలో డోర్‌టుడోర్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ ముసాయిదా వివరాలను వెల్లడించారుమరోవైపు, ఎన్యుమరేషన్ సర్వే సమయంలో దాదాపు 73.39 లక్షల అంటే 21.7 శాతం ఎంట్రీలు అన్‌కలెక్టబుల్ కేటగిరీ కింద నమోదై ముసాయిదా జాబితా నుంచి తాత్కాలికంగా తొలగింపునకు గురయ్యాయి.

వీటిలో శాశ్వతంగా నివాసాలు మారిన వారు , డబుల్ ఎంట్రీలు , మరణించిన వ్యక్తుల వివరాలు ఉన్నట్లు సీఈవో ప్రకటించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఈ తరహా వలస , అన్‌ట్రేసబుల్ ఓటర్ల సంఖ్య భారీగా నమోదైంది. ఓటర్ల సంఖ్య , నివాస ప్రాంతాల మార్పుల ఆధారంగా ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల సంఖ్య 36,353కి పెరిగింది. ఓటర్లు తమ నివాసాలకు సమీపంలో సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, రద్దీని నివారించేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల పరిమితిని క్రమబద్ధీకరించారు. ముసాయిదా జాబితాలో పేర్లు లేని లేదా తప్పులు దొర్లిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పిస్తూ అభ్యంతరాలు, చేర్పుల గడువును అధికారులు ప్రకటించారు. దీని ప్రకారం సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుంది. ఓటర్లు తమ స్థితిని సరిచూసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని, అనంతరం అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

## ప్రిన్సిపాల్ హత్య కేసులో వీడిన మిస్టరీ..

ఎలాంటి విలువైన వస్తువులు చోరీకి గురికాకపోవడంతో ఆమెకు తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానించారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో అనుమానితులను విచారించారు. చివరకు ఇంటి సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఓ బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనిపించడంతో కేసులో పురోగతి లభించింది. ఫుటేజీ ఆధారంగా కొందరు విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఓ విద్యార్థి నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. ప్రిన్సిపాల్ తనకు టీసీ ఇవ్వడంతో ఆమెపై కక్ష పెంచుకున్నానని, అదే సమయంలో డబ్బు కూడా అవసరం కావడంతో ఈ హత్యకు పాల్పడినట్లు నిందితుడు చెప్పినట్లు సమాచారం. హత్య అనంతరం ఇంట్లో నుంచి సుమారు రూ.4 లక్షల నగదు కూడా చోరీకి గురైనట్లు తాజా విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థుల ప్రమేయం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. రూపారెడ్డి కుమారుడి ఫిర్యాదు మేరకు కొండమల్లేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగాల్లో భారీ విజయంతో సత్తా చాటిన మమత..!

ఈ విజయం స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం అధికారంలోకి ఉన్నప్పటికీ, మమత పార్టీ టీఎంసీ నుంచి వరుస ఫిరాయింపులతో పైచేయి సాధిస్తున్నప్పటికీ.. సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ మాత్రం ఈ ఎన్నికల్లో కేవలం 3 సీట్లకు పరిమితమైంది. గతంలోనూ బీజేపీకి ఇక్కడ 3 సీట్లే ఉన్నాయి. ఇది న్యాయవాద వర్గాల్లో టీఎంసీ ప్రభావం ఇంకా కొనసాగుతోందని సూచిస్తోంది. ఎన్నికలు జరిగిన 23 స్థానాలకు గాను, టీఎంసీ 15 గెలుచుకోగా, బీజేపీ, లెఫ్ట్ ఫ్రంట్ చెరో మూడు, కాంగ్రెస్ రెండు స్థానాలను గెలుచుకున్నాయి. మహిళలకు ఐదు స్థానాలు రిజర్వ్ చేయగా, వాటిలో టీఎంసీ నాలుగు, కాంగ్రెస్ ఒకటి గెలుచుకున్నాయి. టీఎంసీ గెల్చిన అభ్యర్థులంతా మమతా బెనర్జీ స్వయంగా ఎంపిక చేసిన వారు కావడం ఇక్కడ మరో విశేషం.

## సామాజిక న్యాయానికి పెద్దపీట

న్యాయానికి పెద్దపీట వేసిందని సీఎం స్పష్టం చేశారు.

1974లో పోలీసు శాఖలో ఎస్సైగా చేరిన వర్ల రామయ్య, 26 ఏళ్ల పాటు నిస్వార్థ సేవలందించి పలు రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ సేవా పురస్కారాలు పొందారు. పదేళ్ల సర్వీసు మిగిలి ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ప్రజాసేవలోకి వచ్చారు. 2001లో టీడీపీలో చేరిన ఆయన ఎస్సీ సెల్ బాధ్యతల నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడి స్థాయికి ఎదిగారు. గతంలో గృహ నిర్మాణ సంస్థ, ఆర్టీసీ ఛైర్మన్‌గానూ సేవలందించారు.

**అట్టడుగు స్థాయి కార్యకర్తకు దక్కిన గౌరవం**

అనంతపురం నగరానికి చెందిన దళవాయి రమాదేవి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా, అంగన్‌వాడీ విభాగ సాధికారిక కన్వీనర్‌గా పార్టీ క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గత ప్రభుత్వ ఒత్తిళ్లను తట్టుకుంటూ 2021 నగరపాలక సంస్థ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. గతంలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేకపోయినా, చరిత్రలో తొలిసారి వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళకు శాసనమండలిలో అడుగు పెట్టే అవకాశం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి సభలో కొనియాడారు.

**నారా లోకేశ్‌తో భేటీ**

ఎమ్మెల్సీగా అవకాశం దక్కడంపై దళవాయి రమాదేవి భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడే సాధారణ కార్యకర్తలను టీడీపీ ఎప్పుడూ విస్మరించదని ఈ సందర్భంగా లోకేశ్ పేర్కొన్నారు.

# యాదగిరిగుట్టలో స్వాతి నక్షత్ర పూజలు

- శ్రీ లక్ష్మీ నరసింహునికి అష్టోత్తర శతకటాభిషేకం కొండ చుట్టూ గిరి ప్రదక్షిణలో భక్తులు

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 19 :**



యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి పర్వదినం పురస్కరించుకొని ఆలయంలో అత్యంత వైభవంగా పూజా మహోత్సవాల నిర్వహించారు. బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా తెల్లవారుజామునే మూడు గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చక స్వాములు సుప్రభాత సేవతో మొదలుకొని ఆలయంలో జరుగు నిత్య పూజలతో పాటు స్వామివారికి అష్టోత్తర శతకటాభిషే కాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కొండ చుట్టూ భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ భక్తులు నిర్వహించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గిరి ప్రదక్షిణ పూజలో పాల్గొని భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ చేశారు. యాదాద్రి క్షేత్రం భక్తులకు కొంగు బంగారంగా నిలిచిందని గిరిప్రదక్షిణ చేసిన ప్రతి భక్తుడికి తన కోరికలు నెరవేరుతాయని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు ఆయన సర్టిఫికె ట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.








## వాహనదారులకు ఇబ్బంది

- రామంతాపూర్ డివిజన్ సమస్యపై జోనల్ కమీషనర్ రాధికా గుప్తాతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

శారదానగర్ ADRM గల్లీలో కొత్తగా బీటీ రోడ్ వేసి దాదాపుగా 6నెలలు అవుతుంది, రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్స్, రోడ్డుకి సమానముగా లేకపోవటం వలన గుంతలుగా ఏర్పడి చాల ప్రమాదాలు జరిగాయి. వాహనదారులు ఇబ్బందికి గురిఅవుతున్నారు అని, ఈ సమస్యపై జోనల్ కమీషనర్ రాధికా గుప్తా దృష్టికి ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు జోనల్ కమీషనర్ సానుకూలంగా స్పందించి, సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి
- పుస్తెమెట్టల కోసం ఆర్థిక సహాయం అందజేత



**జయభేరి, దేవరకద్ర :**

పేద కుటుంబాలకు దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) భరోసా ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే సోదరులు జి.భాస్కర్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంటలో ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు భాస్కర్ రెడ్డి పుస్తె మెట్టెల కోసం బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ బత్తుల బాలరాజ్, మండల యూత్ అధ్యక్షుడు రంజిత్ రెడ్డిల గ్రామ పార్టీ అధ్యక్షుడు పొర్లవెంకటేష్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా లో బుధవారం బద్రీనాథ్ రెసిడెన్సి లో జరిగిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ను ఇంటి యజమాలు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అక్కడ జరిగిన పలు వాస్తు పూజ కార్యక్రమాలలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా నల్లగొండ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా చిత్రం ఉదయ్

- కృతజ్ఞతలు తెలిపిన నూతన ప్రధాన కార్యదర్శి



**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నల్లగొండ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా చిత్రం ఉదయ్ నియమితులయ్యారు. తనపై నమ్మకం, విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్రం ఉదయ్ మాట్లాడుతూ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ ,జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాకీ నరసింహ, రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్ , జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి , జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్ తో పాటు తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని చిత్రం ఉదయ్ తెలిపారు. ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. భారతీయ జనతా పార్టీ అభివృద్ధిలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.




## బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను, కుట్రలను ప్రజలు నమ్మడం లేదు!

**జయభేరి, హైదరాబాద్ :**

గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, అందినకాడికి దోచుకున్న బీఆర్ఎస్ నేతలకు ఇప్పుడు ప్రజల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనను ఓర్వలేక, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అనైతిక ఆరోపణలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తీవ్రంగా ఖండించారు. ధరణి పోర్టల్ తెచ్చి పాత రికార్డుల్లో ఉన్న 13 కాలమ్స్‌ను తొలగించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములను సర్వనాశనం చేసిన కేసీఆర్, హరీష్‌రావు లాంటి వాళ్ళు ఇప్పుడు నీతులు మాట్లాడటం చూస్తుంటే 'దొంగే దొంగ అన్నట్లు' లేదా 'చోరులు వేదాలు వల్లించినట్లుగా' ఉంది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ చిన్న పొరపాటు జరిగినా బాధ్యతగా ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పారు. కానీ, మీ పదేళ్ల పాలనలో ప్రజల్ని అనేక రకాలుగా హింసించి, అణగదొక్కిన మీరు ఎప్పుడైనా ప్రజలకు క్షమాపణ చెప్పారా? అలాంటి నైతికత మీకెక్కడిది? కేవలం రాజకీయ లబ్ధి కోసం పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం చాలా తప్పు, హాస్యాస్పదం.

**మా స్పష్టమైన ప్రశ్నలు మరియు వాస్తవాలు..**

**నిరాధార ఆరోపణలు:** ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుంటే.. ఓర్వలేక ప్రతిరోజూ ఏదో ఒక కుట్రతో ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. 22ఏ భూముల వివాదాల సృష్టికర్తలు మీరే కాదా? మీ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తుంటే అడ్డుతగలడం మీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.

**ప్రజల తీర్పును గౌరవించండి:** ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని ఎప్పుడో తిరస్కరించారు. ఇప్పటికైనా మీ వక్రబుద్ధిని మార్చుకుని, అర్థరహితమైన ఆరోపణలు మానితే మంచిది. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడాలని చూస్తే ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వాన్ని ఇటువంటి బెదిరింపులు, నిరాధార విమర్శలు ఏమీ చేయలేవని బీఆర్ఎస్ నేతలకు మిద్దెల జితేందర్ గట్టిగా హెచ్చరిస్తున్నారు.

## వ్యభిచార ముఠా అరెస్టు

**జయభేరి, కూకట్ పల్లి :**

కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధి భాగ్య నగర్ కాలనీలో గత రాత్రి రెండు ఓయో హోటళ్లలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 12 మందిని గుర్తించిన పోలీసులు.. 11 మందిని అరెస్టు చేసారు. ఆరుగురు నిర్వాహకులు, నలుగురు వినియోగదారులు, ఇద్దరు మహిళలుగా గుర్తించారు. హోటల్ యజమాని పరారీలో వున్నాడు. నిందితుడి కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. 7 స్మార్ట్ఫోన్లు, 2 వాడిన కండోమ్లు, 4 వాడని కండోమ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'పల్లె పల్లెకు' పొన్నం అన్న

- పల్లె పల్లెలో ప్రజా పాలన
- దుద్దెనపల్లిలో ప్రజా పాలన ద్వారా జరిగిన అభివృద్ధి

**హుస్నాబాద్ :**



కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి పల్లె పల్లెకు పొన్నం అన్నపల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దుద్దెనపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన పల్లె పల్లెకు పొన్నం అన్నపల్లె పల్లెలో ప్రజా ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో మంత్రి నేరుగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**దుద్దెనపల్లిలో ప్రజా పాలన ద్వారా జరిగిన అభివృద్ధి:**

ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దుద్దెనపల్లి గ్రామంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. సైదాపూర్ మండలంలో మొదటి దశలో 486 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 370 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 170 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. నియోజకవర్గాన్ని గుడిసెలు లేని నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యం. అత్యంత పేదలు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యతతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. దుద్దెనపల్లిలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 29 ఇళ్లు పూర్తయ్యాయి. ఇద్దరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేమని రద్దు చేసుకున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా.. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గౌరవెల్లి కాలువలకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారు. ఎల్ఎండీ నుంచి వచ్చే నీటి ప్రాజెక్టు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ముఖ్యమంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించామని, త్వరలోనే అనుమతి వస్తుందని తెలిపారు. ఎంఎంఆర్ కింద ఆగిపోయిన పనులకు కూడా త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, గ్రామ సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, రైతులు,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ, రాధికా ఎక్స్ రోడ్స్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించాలి

- ఉప్పల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ ఎక్స్ రోడ్స్, రాధికా ఎక్స్ రోడ్స్ వద్ద రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు రెండు ఫ్లైఓవర్లను నిర్మించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలవడం జరిగింది.

కుషాయిగూడ, రాధికా ఎక్స్ రోడ్స్ ప్రాంతాలు ఈసీఐఎల్, కీసర, నాగారం తదితర ప్రాంతాలకు ప్రధాన అనుసంధాన కేంద్రాలుగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, పెరుగుతున్న నివాస ప్రాంతాలు, భారీగా పెరిగిన వాహనాల రాకపోకల కారణంగా ఈ రెండు ప్రధాన కూడళ్ల వద్ద ప్రతిరోజూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనివల్ల సమయం, ఇంధనం వృథా కావడంతో పాటు వాయు, శబ్ద కాలుష్యం పెరుగుతోందని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రమాదాల అవకాశాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో కుషాయిగూడ ఎక్స్ రోడ్స్ వద్ద ఒక ఫ్లైఓవర్, రాధికా ఎక్స్ రోడ్స్ వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కోరారు. ఈ రెండు ఫ్లైఓవర్లు నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సాఫీగా సాగడంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయని, కీసర, నాగారం, కుషాయిగూడ, ఈసీఐఎల్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల దీర్ఘకాలిక రవాణా సమస్యకు పరిష్కారం చూపే ఈ రెండు కీలక ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, త్వరితగతిన మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.



## కోయిల్ సాగర్ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- ఆయకట్టుకు కోయిల్ సాగర్ నీటి విడుదల

జయభేరి, దేవరకద్ర :

భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్ నీటిని ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జై మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ సూచించారు. కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నుండి కుడి, ఎడమ కాలువల ద్వారా బుధవారం ఆయకట్టుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) విడుదల చేశారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడారు. కోయిల్ సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఇందులో తాగునీటి అవసరాల కోసం 0.6 టీఎంసీల నీటిని కేటాయించామని తెలిపారు.ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపడంతో పాటు బోర్లు రీచార్జ్ అయ్యేలా ఈ రోజు మొదటి విడతగా కాలువల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. సాధారణంగా కాలువలకు నీటిని విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో కనీసం 1.5 టీఎంసీల నీరు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని బోర్ల రీఛార్జ్, చెరువుల నింపుదలకు నీటిని విడుదల చేయడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో రైతులు కొత్తగా తుకాలు వేయవద్దని విజ్ఞప్తి చేశారు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆరుతడి పంటల వైపే రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే జిఎంఆర్ రైతులకు సూచించారు.అదేవిధంగా ప్రస్తుతం ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా కోయిల్ సాగర్‌కు నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల తర్వాత రిజర్వాయర్‌లో నీటి మట్టం ఎంతమేర పెరిగిందో పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా సాధ్యమైనంత మేర రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే జియంఆర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



జయభేరి, మేడ్చల్:

జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్య ఉపాధ్యాయుడిగా సేవలందించిన శ్రీ రామ్మోహన్ పదవీవిరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని రామ్మోహన్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు శుభాభినందనలు తెలియజేసి, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ రామ్మోహన్ తమకు కేవలం ఉపాధ్యాయుడిగానే కాకుండా, జీవితంలో మంచి మార్గాన్ని చూపిన గురువుగా నిలిచారని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆయన చేసిన సేవలు, అందించిన విలువైన సూచనలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, మానవతా విలువలను తమలో పెంపొందించిన ఆయన పదవీవిరమణ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ తమ హృదయాల్లో ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోదని పూర్వ విద్యార్థులు భావోద్వేగంతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట్‌కు చెందిన గౌరారం జగన్ గౌడ్ (మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు), మేడ్చల్ మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అక్రమ్ పాషా, డబిల్ పూర్ క్రిస్టోఫర్, మాజీ కౌన్సిలర్ స్వామి యాదవ్, నాయకులు సంతోష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్, సింహ కిషోర్ పటేల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ చైర్మన్ దంపతులకు ఘన సన్మానం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి దంపతులను బుధవారం స్థానిక ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 9వ వార్షిక మహోత్సవానికి మున్సిపాలిటీ చైర్మన్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా స్వాగతం పలికి స్థానిక ఆర్యవైశ్యులు సన్మానించారు. అలాగే అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజ కార్యక్రమాలలో మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రియాంక మృతి కేసు..

తూర్పుగోదావరి జిల్లాలో డాక్టర్ ప్రియాంక మృతి కేసులో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నిందితులను పోలీసు కస్టడీకి తీసుకోనున్నారు. మద్యం మత్తులో ఉన్న నిందితులు ప్రియాంకను కారుతో ఢీకొట్టి చంపినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, పోలీసులు నిందితులను ప్రశ్నించి, కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

- వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో బుధవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే దేవాలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాన్ని కూడా వైభవంగా నిర్వహించారు. అశేష భక్త జనాభా తిలకిస్తుండగా ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమానికి స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి లతో పాటు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. అమ్మవారి 9వ వార్షికోత్సవ మహోత్సవాలలో భాగంగా మూడవరోజు ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 3 రోజులుగా దేవస్థానంలో అమ్మవారి వార్షిక మహోత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు పలు పూజా కార్యక్రమాలను భక్తశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ప్రతి ఏడాది అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వాహకులు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలను ఆచారం ప్రకారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాసవి మాత అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాల సందర్భంగా అమ్మవారి సన్నిధిలో దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమాల హరిశంకర శర్మ, బ్రహ్మశ్రీ బద్రీనాథ్ శర్మ ల ఆధ్వర్యంలో ధ్వజస్తంభ యంత్ర స్థాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అలాగే వేద పారాయణం, గోపూజ, దేవత అనుజ్ఞ, భూతబలి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, రక్షాబంధనం, దీక్ష ధారణ, అఖండ దీప స్థాపన, నవకలశ స్థాపన, తీర్థ ప్రసాద వితరణ, మత్స్య గ్రహణం, అంకురార్పణం, ద్వాదశ పాత్ర ప్రయోగం, మూర్తి హోమం, ద్వాదశ రాగలాపన, జలాధివాసం నిర్వహించారు. వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా బుధవారం గవ్యాంత పూజలు, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తుబలి, గ్రామ ప్రదిక్షణ, బింబశుద్ధి, మూర్తి హోమాలు, ధాన్యాధివాసం, కుంభ స్థాపన, కళా హోమాలు, పంచశయ్యాది వాసం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో స్థానిక ఆర్యవైశ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశేష మహోత్సవాల సందర్భంగా వాసవి మాత దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ బల్బుల తో శోభాయ మానంగా అలంకరించారు. మామిడి తోరణాలు కట్టింపు కట్టి ముస్తాబు చేశారు. అమ్మవారిని కూడా వివిధ రకాల ఆభరణాలు, పూలతో అలంకరించారు. అలాగే దేవాలయంలో గవ్యాంత పూజలు, ధాతు న్యాసం, యంత్ర ప్రతిష్ట,శుభ ముహూర్తం, యంత్రస్థాపన, నూతన ధ్వజస్తంభ స్థాపన, పూర్ణాహుతి, కళశోధ్వాసన, కుంభాభిషేకం, కుంభ దర్శనం,గోదర్శనం, ప్రథమ దర్శనం, శాంతి కళ్యాణం, మహాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డికి దేవాలయ ఆలయం మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో కవితా మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు హాజరైన కవిత మధుసూదన్ రెడ్డి పై పురహితుల అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే స్థానిక మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు కూడా ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. వారికి కూడా అమ్మవారి తీర్థం ప్రసాదాలను అందజేశారు. ఈ పూజా కార్యక్రమాలలో స్థానిక ఆర్యవైశ్యుల తో పాటు దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, జిల్లా వి హెచ్పీ మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణిల యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లు పాల్గొన్నారు.

## ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడొద్దు.. హిజ్రాలకు మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి సూచన
- డబ్బుల కోసం ఒత్తిడి చేస్తే చట్టపరమైన చర్యలు
- శుభకార్యాల్లో నిర్వాహకులకు ఇబ్బందులు కలిగించొద్దు
- బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు
- సమస్యలు ఉంటే ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించాలి



జయభేరి, మేడిపల్లి, ఆగస్టు 19 :

సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, పరస్పర సహకారంతో జీవించాలని, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి హెచ్చరించారు.

ప్రజలను బెదిరించడం, డబ్బుల కోసం ఒత్తిడి చేయడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.మంగళవారం పీర్జాదిగూడ ప్రాంతంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై దాడి జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో హిజ్రాలకు సామాజిక అంశాలు, చట్టపరమైన బాధ్యతలపై కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి మాట్లాడుతూ.... హిజ్రాలు సమాజంలో అందరితో సమానంగా గౌరవప్రదంగా జీవించేందుకు హక్కు ఉందని, అయితే జీవనోపాధి కోసం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం లేదా గొడవలకు దిగడం సరికాదన్నారు.

ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా శుభకార్యాలు, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాల సమయంలో నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేయకుండా సహకరించాలని సూచించారు. డబ్బుల విషయంలో ఒత్తిడి చేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, ఘర్షణలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు లేదా వివాదాలు ఎదురైతే నేరుగా ఘర్షణలకు దిగకుండా పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు.పోలీసుల సూచనలను పాటిస్తూ చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు.

సమాజంలో అందరూ పరస్పరం గౌరవించుకుంటూ, చట్టాన్ని గౌరవించి సహకారంతో ముందుకు సాగితే హిజ్రాలకు సమాజంలో మరింత గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుందని సీఐ జలంధర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి పోలీసు సిబ్బంది, పలువురు హిజ్రాలు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల పై ప్రత్యేక అవగాహన సదస్సు

- ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి హాజరైన కలెక్టర్, ఉద్యాన శాఖ అధికారులు

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ మండలం శేర్ పల్లిలో బుధవారం సర్పంచ్‌లకు ఆరుతడి పంటలు, ఉద్యాన పంటలు, పంటల మార్పిడి, ఎల్‌నినో ప్రభావం వంటి అంశాలప ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో పాటు జిల్లా కలెక్టర్ ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌ఫామ్ సాగును ఎమ్మెల్యే జిఎంఆర్ జిల్లా ఉద్యాన శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అలాగే రైతులతో నేరుగా మాట్లాడి సాగు విధానం, నీటి వినియోగం, దిగుబడులు, మార్కెటింగ్ తదితర అంశాలను తెలుసుకున్నారు.

అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం వంటి అంశాల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి, ఎక్కువ రాబడి వచ్చేలా వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులను రైతులు అర్థం చేసుకుని, అందుకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవాలని నియోజకవర్గ రైతాంగానికి సూచించారు. ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడి, ఉద్యాన పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌ఫామ్ వంటి ప్రత్యామ్నాయ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సర్పంచ్‌లపై ఉందన్నారు. వ్యవసాయంలో కొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అగ్రికల్చర్ అధికారులతో చర్చించి పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.

రైతుల ఆదాయం పెంచడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే విధంగా నియోజకవర్గంలో పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు నిరంతరం అవగాహన కల్పించి, ఉద్యాన పంటలు మరియు ప్రత్యామ్నాయ సాగు విధానాలను ప్రోత్సహించాలని అధికారులను కోరారు.తదనంతరం ఎమ్మెల్యే జియంఆర్ ఆహ్వానం మేరకు హాజరైన టీ జి ఎస్ పి డి సి ఎల్ సీఎండీ ఐఏఎస్ అధికారి జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. తాను గతంలో కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా పనిచేసినప్పుడు ఆ జిల్లాలో హార్టికల్చర్ పంటల సాగుకు, వారు ప్రోత్సహించిన విధానాలపై ఇక్కడి రైతులకు అవగాహన కల్పిస్తూ, ఆయా పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్, హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు, నియోజకవర్గ సర్పంచులు, రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పంటల గుర్చి రైతులకు అవగాహన కార్యక్రమం

- గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి

జయభేరి, గుడిపల్లి :

రైతు వేదిక నందు ఎలినో ప్రభావం వల్ల వేసే పెసలు, కందిపప్పు, అలసంద పంటల గుర్చి రైతులకు అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ముందు నుంచే చెబుతున్న ఎలినో ప్రభావం ఇప్పటికే విధంగా ఉందో మనందరం చూసినటువంటి అంశమే కాబట్టి రైతులు ఆరుతడి పంటలు కాకుండా చిరుధాన్యాలు పండించి రైతుపై భారం పడకుండా అప్పుల ఊబిలో చిక్కుకోకుండా ఉండాలి అని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఈరోజు గుడిపల్లి రైతు వేదిక నందు రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ రాజు పిఎసిఎస్ సీఈవో ప్రభాకర్ ఏఈఓ దుబేర రైతులు పాల్గొని విజయవంతం చేసినారు.



## 15 కిలోమీటర్ల వరకు ఎల్ పిజి గ్యాస్ సిలిండర్ ఫ్రీ డెలివరీ చేయాలి

- ఆర్టిఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్

జయభేరి, దేవరకొండ :

కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థల (IOCL, BPCL, HPCL) నిబంధనల ప్రకారం, గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ నుండి 15 కిలోమీటర్ల వ్యాసార్ధం (Radius) వరకు సిలిండర్ ఇంటికి డెలివరీ చేయడానికి ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

ముఖ్యమైన నిబంధనలు

సిలిండర్ బిల్లులోనే డెలివరీ ఛార్జీలు ప్రభుత్వం ప్రకటించే ప్రతీ LPG సిలిండర్ అధికారిక బిల్లులోనే (రిటైల్ సెల్లింగ్ ప్రైస్/MRP) డెలివరీ ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి. అదనపు డబ్బులు చట్ట విరుద్ధం డెలివరీ బాయ్ ఎలాంటి అదనపు రుసుము లేదా టిప్స్ బలవంతంగా వసూలు చేయడానికి వీల్లేదు. 15 కి.మీ. దాటిన ప్రాంతాలకు:గోడౌన్ నుండి 15 కిలోమీటర్ల పరిధి దాటిన ప్రాంతాలకు మాత్రమే చమురు కంపెనీలు నిర్ణయించిన అదనపు రవాణా రుసుము వర్తిస్తుంది. సిలిండర్ అందించే సమయంలో డెలివరీ సిబ్బంది బరువును తనిఖీ చేసి (వెయిట్ చెక్ ), సిల్ సరిగ్గా ఉందో లేదో చూపి అందించాలి.గోడౌన్ వద్ద స్వయంగా తీసుకుంటే రిబేట్ ఒకవేళ వినియోగదారుడే స్వయంగా గోడౌన్ వద్దకు వెళ్లి సిలిండర్ తీసుకుంటే, బిల్లులో చేర్చబడిన డెలివరీ ఛార్జీలను (దాదాపు రూ. 2730) గ్యాస్ ఏజెన్సీ తిరిగి చెల్లించాలి.

అదనపు డబ్బులు అడిగితే ఫిర్యాదు చేసే మార్గాలు

టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్: 1800 233 3555 కి కాల్ చేసి మీ ఏజెన్సీ పేరుతో కంప్లైంట్ నమోదు చేయవచ్చు. అధికారిక యాప్‌లు Indane (One Consumer), HP Pay, లేదా Hello BPCL యాప్‌లలోకి వెళ్లి 'Grievance/Complaint' సెక్షన్‌లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.ప్రభుత్వం నిబంధన ప్రకారం 15 కిలోమీటర్ల వరకు ఎల్ పి జి (LPG) గ్యాస్ సిలిండర్ను ఫ్రీగా డెలివరీ చేయాలని ఆర్టిఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర. కిషన్ నాయక్ డిమాండ్ చేశారు.

## కేతావత్ మహేష్ ను పరమార్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్



జయభేరి, నేరేడు గోమ్ము :

నేడు గోమ్ము మండల పరిధిలోని చిన్న మునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ మహేష్ రొడ్డు ప్రమాదం లో గాయపడటంతో వారి నివాసానికి వెళ్లి కేతావత్ మహేష్‌ను పరమార్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్. ఈ కార్యక్రమంలో జీవన్ భగత్, కేతావత్ మంజ్య నాయక్, హరి నాయక్, డాక్య,నాగు నాయక్, సోమా, చంటి బిక్కు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బంద్ సమ్మె వాల్ పోస్టర్ విడుదల

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ఆటో యూనియన్ సమ్మె బంద్ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈనెల 24 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు బంద్ చేస్తున్న నేపథ్యంలో ఈ సమ్మె వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. దేవరకద్ర నియోజకవర్గం ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ సమ్మె వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. అలాగే శ్రీకాంత్ యాదవ్ తో పాటు ఎంఆర్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొబ్బిలి ఆంజనేయులు, జేఏసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాము ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన ఆటో సంక్షేమ బోర్డు, ఏడాదికి ఆటోలకు 12 వేల రూపాయలు తమన్నా డిమాండ్ ను తక్షణమే నెరవేర్చా లన్నారు. అలాగే ఆర్టీసీ యాజమా న్యానికి ఇవి ఆటోలు ఇవ్వాలన్న ఆలోచన విధానాన్ని విరమించుకోవాలన్నారు. ఈనెల 24 లోపే ప్రభుత్వం దిగివచ్చి ఆటో



యూనియన్ నాయకులతో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిచో రాష్ట్రంలో జరిగే పరిణామాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే దొబ్బలి ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్ని రోజులైనా సరే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చేదాకా ఈనెల 24 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో రవాణా సౌకర్యాలు కల్పిస్తూ ఆర్టీసీ తర్వాత ఆటోలేనన్నారు. ఆటోల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతు న్నారన్నారు. నిరుద్యోగులను ఆటోలో ఎంతగానో ఆదుకుంటున్నాయన్నారు. చదువుకున్న నిరుద్యోగులు ఉపాధి దొరకక ఆటో రిక్షాలు నడుపుకొని జీవన ఉపాధి పొందుతు న్నారన్నారు. కే.రాము మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ మహిళలకు ప్రయాణం పద్ధతిని స్వాగతిస్తు న్నామన్నారు. కానీ దానికి ఆటో యూనియన్ వ్యతిరేకం కాదన్నారు. కానీ ఎన్నికల్లో ఆటో యూనియన్ లకు ఇచ్చిన హామీలు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు పట్టించుకోవడం చాలా విచారకరమైన విషయం అన్నారు. దయచేసి ఇప్పటికైనా ఆటో కార్మికులను గుర్తించి సంక్షేమ బోర్డు, అలాగే సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి సంబంధించిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేతో ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడి ఆత్మీయ కలయిక

**జయభేరి, దేవరకద్ర :**

హైదరా బాద్ లోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను బుధవారం రాత్రి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి కలవడం జరిగింది. ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యలో వీరిద్దరి ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు కుశల ప్రశ్నలు వేసుకున్నారు.



## రాష్ట్ర గీతమే ఫస్ట్

■ **మద్రాస్ హైకోర్టు**

తమిళనాడులో ప్రభుత్వ కార్యక్రమాలలో మొదటగా రాష్ట్ర గీతం 'తమిళ్ తాయ్ వాళ్తు'ను ఆలపించాలని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల కేంద్ర హోం శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో వందేమాతరం ముందు పాడాలని ఎక్కడా పేర్కొనలేదని, రాష్ట్ర గీతాన్ని చివరి స్థానానికి నెట్టేయలేదని కోర్టు వ్యాఖ్యానించింది. చెన్నైకి చెందిన అనన్య రాధాకృష్ణన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ స్పష్టత వచ్చింది. ప్రభుత్వ కార్యక్రమాలను తమిళ గీతంతో ప్రారంభించి, జాతీయ గీతంతో ముగించడం తమిళనాడులో చాలాకాలంగా వస్తున్న సంప్రదాయమని పిటిషనర్ వాదించారు. అయితే, ఇరుపక్షాల వాదనలు అనంతరం పిటిషన్‌పై హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది.

## రోడ్డు దాటుతుండగా యువతిని ఢీకొట్టిన కారు..

■ **అక్కడికక్కడే మృతి**

రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన ఈ నెల 16న హైదరాబాద్ పరిధి మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో జరిగింది. లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతిముఖి(26) అనే యువతి పూడా అశోక్ అలోన్‌తో కలిసి భోజనం చేసి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో సంజుస్ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా, అతి వేగంగా కారు నడిపి ఆమెను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలైన భారతిముఖిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## నకిలీ టికెట్లతో జెడ్డా వెళ్లేందుకు యత్నం..

■ **శంషాబాద్‌లో దంపతులు అరెస్ట్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నకిలీ విమాన టికెట్లతో జెడ్డా వెళ్లేందుకు ప్రయత్నించిన దంపతులను అధికారులు పట్టుకున్నారు. ఖతార్ ఎయిర్‌లైన్స్ విమాన టికెట్లను అధికారులకు చూపించగా, అవి నకిలీవని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. విచారణలో, ఒక ఏజెంట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసినట్లు దంపతులు తెలిపారు. విదేశాలకు పంపిస్తామని చెప్పి ఏజెంట్ వారిని మోసం చేసి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

## ఉదయ్ కృష్ణారెడ్డికి డీఎన్ఏ టెస్టులు

అత్యాచారం, హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతి మంజూరు చేసింది. బాధితురాలి గాయాలు, దుస్తులపై లభించిన ఆధారాలతో నిందితుడి బ్లడ్ శాంపిళ్లను పోల్చనున్నారు. పోలీసు కస్టడీ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో, పోలీసులు కీలక ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సూసైడ్ నోట్, ఐఫోన్, రహస్య వీడియోలు ఎక్కడున్నాయనే ప్రశ్నలకు ఉదయ్ కృష్ణారెడ్డి 'నాకు తెలియదు' అని సమాధానమిచ్చినట్లు సమాచారం.

## ముగ్గురు డ్రగ్ పెడ్లర్స్ అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్ :**

శేరిలింగంపల్లిలో పోలీసులు ముగ్గురు డ్రగ్ సెడ్లర్స్ ను అరెస్టు చేసారు. వారినుంచి 94 గ్రాముల mdma డ్రగ్, 50 గ్రామ్స్ ఓజీ డ్రగ్ సీజ్ చేసారు. ఈ నెల 11 వ తేదీన గచ్చిబౌలి పీఎస్ లిమిట్స్ వట్టినాగులపల్లి లో ఒక డ్రగ్ పెడ్లర్ డ్రగ్స్ సప్లై చేస్తుండగా పట్టుకున్నాం.. నిందుతుని తో పాటు 16 మంది కంజ్యుమర్లను అదుపులోకి తీసుకున్నాం..నిందితుడు యస్వంత్ సాయి ని విచారించగ బెంగళూరు కు చెందిన నవీనా, కేరళ కు చెందిన అబ్దుల్ గఫూర్ ల నుండి డ్రగ్ తెచ్చినట్లు వెల్లడి అయింది. నవీనా, గఫూర్ లను కూడా అదుపులోకి తీసుకున్నామని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్.. సైబరాబాద్ SOT డీసీపీ శోభన్ వెల్లడించారు.


# త్యాగం మీది.. అండ మాది

■ **వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం**

■ **నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

■ **ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు**

**జయభేరి, అమరావతి, ఆగస్ట్ 19 :**



వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం... బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

**రూ.518 కోట్ల మేర పరిహారం అందజేత**

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్టైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

# కమలం.. కొత్త వ్యూహం..

**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణలో 2028 ఎన్నికల్లో అధికారం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో బీజేపీ అధిష్టానం కీలక వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీ బలోపేతం, సంస్థాగత పునర్నిర్మాణం, నాయకత్వ సర్దుబాట్లు ఇవన్నీ ఒకే దిశలో కదులుతున్నాయి. ఈ ప్రక్రియలో పది మందితో కమిటీ ఏర్పాటు, జాతీయ కార్యవర్గం నుంచి కొందరు నాయకులను తప్పించడం, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్ వంటివి ముఖ్యమైన అంశాలుగా కొత్త వ్యూహంలో భాగంగా ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి పది మందితో కమిటీని ఏర్పాటు చేశారు.

క్షేత్రస్థాయి నుంచి నాయకత్వ వరకు ఉన్న లోపాలను గుర్తించి, నిర్దిష్ట చర్యలు చేపట్టే దిశగా ఈ కమిటీ పని చేస్తుంది. తెలంగాణలో బీజేపీ ఇంకా స్థిరమైన సామాజిక, ప్రాంతీయ బలాన్ని సాధించలేదన్న భావనతోనే ఈ కమిటీ పనిచేస్తుందిబండి సంజయ్, కె. లక్ష్మణ్, డీకే అరుణలను జాతీయ కార్యవర్గం నుంచి తప్పించడం కేవలం పరిపాలనా మార్పు కాదు. పార్టీ వర్గాల ప్రకారం ఇది తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించే వ్యూహంలో భాగం. జాతీయ స్థాయి బాధ్యతల నుంచి విముక్తి చేయడం ద్వారా వారిని రాష్ట్ర స్థాయి పనులపై పూర్తి శ్రద్ధ పెట్టే అవకాశం కల్పించింది. ఇది అంతర్గత సమతుల్యతను కాపాడుతూ, రాష్ట్ర కార్యాచరణను వేగవంతం చేసే ప్రయత్నంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.నవంబర్ నుంచి తెలంగాణపై బీజేపీ పూర్తి దృష్టి పెట్టనుంది. ఈ సమయంలో రాష్ట్ర కమిటీలో బండి సంజయ్, ఈటల రాజేందర్‌లకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ఇది అనుభవజ్ఞులైన నాయకులను ముందుకు తీసుకువచ్చి, సంస్థాగతంగా, రాజకీయంగా బలమైన బృందాన్ని తయారు చేస్తుంది. 2023 ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, మరింత సమన్వయంతో కార్యాచరణ సాగించాలన్న ప్రణాళికతో ముందుకెళ్తోంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర, బీజేపీ మూడో స్థానంలో ఉంది.

2028 ఎన్నికల నాటికి త్రిముఖ పోరులు బిజెపిని ముందు నిలిపేలా అధిష్టానం వ్యూహాత్మకంగా పావులు కలుగుతుంది. బీజేపీకి ఇంకా విస్తృత సామాజిక బేస్, స్థిరమైన నాయకత్వం, స్థానిక సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయం అవసరం. 10 మెన్ కమిటీ, నాయకత్వ సర్దుబాట్లు, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్.. ఇవన్నీ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా కనిపిస్తున్నాయి. 2028 లక్ష్యం చాలా దూరంగా ఉన్నప్పటికీ, ఇప్పటి నుంచే సంస్థాగత పునాదులు వేయాలనేది అధిష్టానం ఆలోచన.బీజేపీ తెలంగాణలో కేవలం ప్రతిపక్ష పాత్రకే పరిమితం కాకుండా, అధికార పార్టీగా మార్చాలని స్పష్టమైన లక్ష్యంతో అధినాయకత్వం చర్యలు చేపట్టింది. ఎందుకు అవసరమైన వ్యూహాలతో ముందుకు కదులుతోంది. ఈ వ్యూహాలు ఎంతవరకు విజయవంతమవుతాయో రాబోయే రోజుల్లో స్పష్టత వస్తుంది.

## వైద్యంకోసం వచ్చి విగతజీవులై..

■ **కోల్ కత్తా హోటల్లో భారీ అగ్నిప్రమాదం**

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్కతాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఒక హోటల్లో మంటలు చెలరేగడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఒక చిన్నారి కూడా ఉంది.

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్ నుంచి వైద్యంకోసం వచ్చిన పలువురు కోల్కతాలో న్యూమార్కెట్ సమీపంలోని ఒక హోటల్లో బస చేస్తున్నారు.

అంతా నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

అప్పటికే మంటలు చుట్టుముట్టడంతో వారంతా చిక్కుకుపోయారు. చనిపోయిన తొమ్మిది మంది బంగ్లాదేశ్ జాతీయులని అధికారులు వెల్లడించారు.

ఏసీలో పేలుడే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రస్తుతం మంటలు ఆరిపోయాయి.

ఈ ఘటనలో ఆరుగురికిపైగా గాయపడ్డారు. ఇటీవలే బెంగాల్ లోని బీరభూమ్ జిల్లా తారాపీఠ్ ఒక హోటల్లో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే.

మంటలు చెలరేగడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గ్రౌండ్ ఫ్లోర్లోని హోటల్ రిసెప్షన్లో మొదలైన మంటలు.. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి.

అప్పుడు అతిథులంతా నిద్రలో ఉండటంతో ప్రాణనష్టం జరిగింది.

## పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను సాంకేతిక విద్యాశాఖలోనే కొనసాగించాలి

■ **సిద్దిపేట ఉమేన్స్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల నిరసన**



**జయభేరి, సిద్దిపేట :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు కావస్తున్నా నేటికీ విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిలేక విద్యార్థుల సమస్యలు పట్టించుకునేనాథుడే లేకుండాపోయిందని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను సాంకేతిక విద్యాశాఖ నుండి ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నాడని,సాంకేతిక విద్యా శాఖ లోనే కొనసాగించాలని సిద్దిపేట లో ఉమేన్స్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ధర్నా కు బిఆర్ఎస్ విద్యార్తి విభాగం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు ఏడు దశాబ్దాల సుదీర్ఘ ఘన చరిత్ర ఉందని, ఎందరో నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యనభ్యసించి దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 95% మంది నిరుపేద విద్యార్థులు నామమాత్రపు కళాశాల ఫీజు కట్టి నాణ్యమైన ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ స్థాయి విద్యను డిప్లొమా స్థాయిలోనే నేర్చుకుంటున్నారని ఇలాంటి పటిష్టమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యాచట్టం పరిధి నుండి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ చట్టం పరిధిలో చేర్చడం వలన నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ చదువులకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయని తద్వారా పాలిటెక్నిక్ వ్యవస్థ పతనమవుతుందని ఆవేదన వ్యక్తంచేసారు. ప్రభుత్వం ఎలాంటి ముందస్తు అభిప్రాయ సేకరణలు చేపట్టకపోవడం, ఇప్పటికీ స్పష్టమైన విధివిధానాలు బహిర్గతం చేయకపోవడం వలన ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం తమ భవిష్యత్ గురించి అయోమయంలో ఆందోళనలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ నిర్వీర్యానికి దారితీసే జీవో 97 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర మంత్రిమండలి అమోదించిన శక్తి శాఖలోకి పాలిటెక్నిక్ల విలీనం నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థకు అండగా నిలబడి శక్తి శాఖలోకి పాలిటెక్నిక్ల విలీనం బిల్లు చట్టబద్ధం కాకుండా ఎఐసీటీఈ ప్రమాణాలతో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే ఎస్బీటీఈటీ బోర్డు పర్యవేక్షణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ యధాతతంగా కొనసాగేలా పోరాటంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థకు బాసటగా బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని వారు తెలిపారు. యథాతంగా కొనసాగె వరుకు పోరాటం ఆగదని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యోగులారా మీరు చేసే యుద్ధంలో మేమే ముందుంటాం

■ **కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**జయభేరి, కరీంనగర్ :**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో గ్రాఫర్లను సన్మానించిన కేంద్ర మంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 27 నుండి ఉద్యోగ సంఘాల జేఏసీ చేపట్టిన పోరుబాటకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే యుద్ధంలో బీజేపీ సైనికులే ముందుండి పోరాడేందుకు సిద్ధమన్నారు. ఈ యుద్ధంలో మీ కంటే ముందు మేమే ఉంటాం. పోలీసులు లాఠీఛార్జ్ చేస్తే ఆ దెబ్బలు మేమే తింటాం. తూటాలు పేలిస్తే ఆ తూటాలకు మేమే బలయ్యేందుకు సిద్ధం అని భరోసా ఇచ్చారు. జేఏసీలో ఒకరిద్దరు నాయకులు ప్రభుత్వానికి అమ్ముడుపోయి ఉద్యమాన్ని వాయిదా వేయడం పరిపాటిగా మారిందని, అట్లాంటి వాళ్లను ఇకపై జేఏసీలో కొనసాగించవద్దని కోరారు. గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం, అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈరోజు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. సమాజానికి ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తదితరులతో కలిసి ఉద్యోగుల జేఏసీ పోరుబాటుకు మద్దతుగా మాట్లాడారు. కరీంనగర్ డెయిరీ విషయంలో రాజకీయ కోణంలో చూడొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నా. సాఫీగా సాగుతున్న కరీంనగర్ డెయిరీని దెబ్బతీసి వాళ్ల ఆస్తులపై కన్నేయడం సరికాదు. లక్షలాది మంది రైతులకు మేలు చేసే సంస్థ.కక్ష సాధింపు చర్యలు సరికాదు. ఏదో ఒక పేరుతో బాగా నడిచే కరీంనగర్ డెయిరీని అప్రదిష్టపాల్జేసి రైతులకు అన్యాయం చేయాలని చూడటం దుర్మార్గం. ఒక వ్యక్తిని లక్ష్యం చేసుకుని వ్యవస్థను దెబ్బతీయడం దారుణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రత్యేకంగా ఈ డెయిరీపై దృష్టి పెట్టాలి. న్యాయం చేయాలి. ప్రభుత్వం పక్షాన సాయం చేయకపోయినా ఫరవాలేదు దయచేసి అన్యాయం చేయొద్దని కోరుతున్నా.

# ఫస్ట్ టైమ్ స్పెషల్ సాంగ్ చేస్తున్న కీర్తి సురేష్..



దసరా లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత న్యాచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో 'ది ప్యారడైజ్' సినిమా తెరకెక్కుతోంది. అయితే ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా కోసం తనకు బాగా కలిసొచ్చిన హిట్ పెయిర్ సెంటిమెంట్‌ను మరోసారి రిపీట్ చేస్తున్నారు నాని. ఇంతకీ ఎవరా పెయిర్ అనుకుంటున్నారా..? అయితే వాచ్ దిస్ స్టోరీ. దసరా సినిమాతో మాస్ ఆడియన్స్‌కు పూనకాలు తెప్పించిన నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల.. ప్రెజెంట్ 'ది ప్యారడైజ్' సినిమాను రూపొందిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా విషయంలో తనకు బాగా కలిసొచ్చిన సెంటిమెంట్‌స్‌ను రిపీట్ చేస్తున్నారు నాని. ముఖ్యంగా కాస్టింగ్ విషయంలో తన లక్కీ కోస్టార్‌కే మరోసారి ఓటేశారు న్యాచురల్ స్టార్. నేను లోకల్, దసరా సినిమాల్లో నానికీర్తి సురేష్ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యింది. ముఖ్యంగా దసరాలో వీళ్ల పెయిర్ బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేసింది. అందుకే మరోసారి అదే ఫార్ములాను రిపీట్ చేస్తూ 'ది ప్యారడైజ్' సినిమాలో కీర్తి సురేష్‌ను ఓ స్పెషల్ సాంగ్ కోసం సెలెక్ట్ చేశారు. ఇప్పటివరకు పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్స్‌తో మెప్పించిన మహానటి, ఫస్ట్ టైమ్ ఓ హైవోల్టేజ్ మాస్ సాంగ్‌లో గ్లామర్ టర్న్ తీసుకోబోతుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా సాంగ్స్ పై ఆల్రెడీ భారీ అంచనాలున్నాయి. దానికి తోడు కీర్తి సురేష్ లాంటి స్టార్ హీరోయిన్ మాస్ స్టెప్పులు వేయనుండటంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలవనుందన్న టాక్ వినిపిస్తోంది. ఆల్రెడీ ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ కూడా స్టార్ట్ అయింది. ఓ భారీ సెట్‌లో వెయ్యి మంది డ్యాన్సర్ల మధ్య ఈ పాటను గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నారు.



# మస్తుగుందిర యవ్వారం

యంగ్ హీరో హవీష్ కథానాయకుడిగా, త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ'. సత్యనారాయణ కోనేరు సమర్పణలో, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయిక. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించగా, తాజాగా చిత్రంలోని 'మస్తుగుందిర యవ్వారం..' అంటూ తెలంగాణ స్లాంగ్‌లో సాగే పాటను వరంగల్ శాసన సభ్యులు నాయని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా హనుమకొండలోని కాళోజి కళా క్షేత్రం వేదికగా గురువారం ఘనంగా విడుదల చేశారు. కాశర్ల శ్యామ్ రాసిన ఈ పాటను మిక్కీ జే మేయర్ స్వరపరిచారు. అందమైన విజువల్స్‌తో పాటు హీరో హవీష్, హీరోయిన్ కావ్య థాపర్ కెమిస్ట్రీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హవీష్‌ను కొత్తగా చూపిస్తూ తనదైన శైలిలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా త్రినాథరావు నక్కిన ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని, కామెడీ, రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలు కూడా ఈ చిత్రంలో ఉంటాయని చిత్రబృందం తెలిపింది.

# స్టైలిష్ డాక్టర్ ధర్మన్



సూపర్‌స్టార్ రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్' (ది డెడ్లీ డాక్టర్) శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో అగ్ర హీరో కమల్‌హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా రెండో షెడ్యూల్ మొదలైంది. ఈ సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రజనీకాంత్ మెడలో స్టెతస్కోప్‌తో స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, రజనీకాంత్ పాత్ర సరికొత్త పంథాలో సాగుతుందని మేకర్స్ తెలిపారు. అన్బరివ్ ద్వయం యాక్షన్ కొరియోగ్రఫీ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.



# మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను

'ఇందులో నా పాత్ర పేరు మహాదేవి. దేవుని అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను' అన్నారు నటి కామాక్షి భాస్కర్ల. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'అగధ'. శ్రవణ్‌రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఎమ్మెస్ రాజు దర్శకుడు. ఈ నెల 14న విడుదల కానున్నది. గురువారం హైదరాబాద్‌లో కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. 'ఎమ్మెస్ రాజుగారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. కానీ ఎమ్మెస్ రాజుగారు కూర్చోబెట్టి కథ చెప్పి, నాపాత్రను వివరించారు. నిజంగా కథ, నా పాత్ర మనస్ఫూర్తిగా నచ్చాయి. ఇది కేవలం హారర్ థ్రిల్లర్ మాత్రమే కాదు. డివైన్ మూమెంట్స్ కూడా ఇందులో బలంగా ఉంటాయి. టెక్నికల్‌గా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది' అని తెలిపింది కామాక్షి భాస్కర్ల.

# మొదటి సినిమాతోనే రూ.58 కోట్లు..

## బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న లోకేష్ కనగరాజ్ 'డీసీ'!




కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**